# పిల్లల పార్క్ పేరుపై ఎందుకీ అనవసర రభస?

పేరులోన ఏ ముస్సాది పెన్నిధి అని ప్రశ్నించిన పాత కాలం పెద్ద మనిషి ఎవరో కాని, ఆయనే ఇప్పుడు బ్రతికి నెల్లూరుకు వస్తే పేరు తెచ్చే తంటా ఎంత పెద్దదో చూసి మూర్ఛపోవడం ఖాయం. ఒక్కొక్కసారి చిన్న సంగతులు కూడా రాజకీయ గానుగలో పడి నలిగి పెను తుఫాను వలె మారిపోతుంటాయి. వెంకారెడ్డి పాలెం రోడ్డులో నిర్మింతమౌతున్న జన్మభూమి పిల్లల్స్ పార్క్ పరిస్థితి అదే ఇప్పుడు. జన్మభూమి పథకానికి శాశ్వత చిహ్నంగా ఏదో ఒక గుర్తుంచే పని చేయాలనే ఆలోచన కలెక్టర్ శ్రీమతి వై. శ్రీలక్ష్మిలో కలిగింది. అప్పటికి మునిసిపల్ ఛైర్మన్‌గా వుండిన ఆనం వివేకానంద రెడ్డి ఆమెను సమర్థించారు. వీరిద్దరి ఆలోచనల్లో నుంచి పిల్లల పార్క్ పుట్టింది. పెంట దిబ్బలుగా వుండిన స్థలం కాస్తా ఒక్క వారం వ్యవధిలో చదునైన మైదానంగా మారిపోయింది. ఈ లోగా వారితో జెవిఎస్ రెడ్డి జత కలిశారు. కాంట్రాక్టుల కుబేరుడైన జెవిఎస్ రెడ్డి నెల్లూరులో ఏదో ఒక మంచి పని చేయాలనే తపనతో వుండినారు. ఆ స్ఫూర్తితోనే ఆయన రెడ్‌క్రాస్ రక్తనిధికి, క్యాన్సర్ క్లినిక్‌కు 30 లక్షల విరాళం ఇచ్చారు. ఆయనలోని ఉత్సాహం చూసి కలెక్టర్ గారు పిల్లల పార్క్ పని అప్ప జెప్పారు. ఆయనా సంతోషంగా సవాల్‌గా స్వీకరించి దాన్ని అందంగా తీర్చిదిద్దారు. మూజికల్ ఫౌంటెన్, స్కేటింగ్ రింగ్, స్విమ్మింగ్ పూల్ వంటి ఆధునిక అలంకారాలతో పార్కుకు ఎక్కడలేని శోభ తెచ్చారు. పెద్ద పెద్ద సిటీలలో సైతం ఇంతటి సౌకర్యాలు కల్గిన పార్కు లేదు. నెల్లూరుకు దిష్టుకోదగిన అలంకారం ఇది.

ఏడాది పై నుంచి పార్క్ నిర్మాణం పని కొనసాగుతూ వుంది. ఇంతకాలం దానికి ఏ పేరు పెట్టాలో ఎవరూ ఆలోచించ లేదు.

## ఏ.సి. సుబ్బారెడ్డి పేరును వివాదాస్పదం చేయడం విచారకరం - గర్హనీయం!

వివేకానంద రెడ్డి ఎమ్మెల్యేగా గెలవగానే, మునిసిపాలిటీలో ఒక తీర్మానం ప్రవేశపెట్టి, దానికి ఏసి సుబ్బారెడ్డి పార్కు అని నామకరణం చేయాలని ప్రతిపాదించారు. అందుకు అప్పుడెవరూ అభ్యంతరం చెప్పలేదు. కాని ఇప్పుడు అభ్యంతరం ఎదురైంది. ఏసి పేరుతో ఇప్పటికే టౌన్‌లో చాలా సంస్థలున్నాయి కాబట్టి, దీనికి సింహపురి పార్కు అని పేరు పెట్టాలని జెవిఎస్ రెడ్డిగారు ప్రతిపాదించారు. నెల్లూరు తిక్కన పుట్టిన స్థలం కాబట్టి, ఆ మహాకవి స్మృత్యంకం ఏదీ నెల్లూరులో లేదు కాబట్టి ఆయన పేరు పెట్టడం సముచితమని కలెక్టర్ భావించారు. వివేకానంద రెడ్డి తాను ముందడుగు వేశాను కాబట్టి, వెనక్కు తగ్గే ప్రశ్నే లేదని మొండి కేశారు. పిల్లుల మధ్య పోరు పిల్లి తీర్చినట్లు మంత్రి ఆదాల ప్రభాకర రెడ్డి సైగ్గా రంగప్రవేశం చేసి మునిసిపల్ కౌన్సిల్ చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం చేత రద్దు చేయించి తిరిగి పేరు ఖాయం చేశారు. దానితో ఇది రాజకీయ రంగు పులుముకున్నది. మునిసిపల్ కౌన్సిల్ తీర్మానం రద్దు కోసం ప్రభుత్వం విడుదల చేసిన జిఓలో ఏసి సుబ్బారెడ్డిని కించ పరుస్తూ వ్యాఖ్యలు చేయడం పట్ల వివేకానంద రెడ్డి ఉగ్రుడైనాడు. పంతాలు పెరిగిపోయాయి; రచ్చ తారాస్థాయి నందుకొన్నది.

కౌన్సిల్ తీర్మానం రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి వుంది, దానికెవరూ అడ్డం చెప్పలేదు. అయితే అందుకు ఏదో ఒక కారణం చూపాలి కాబట్టి - "ఏసి పేరు పెడితే శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం వుందని; ఆయన వివేకానంద రెడ్డికి బంధువు కాబట్టి రాజకీయ వర్గ సమస్య ఏర్పడుతుందని, అందువల్ల ఆ పేరు తొలగిస్తున్నామని" పేర్కొన్నారు. ఏసి సుబ్బారెడ్డిని వివేకానంద రెడ్డి బంధువుగా చూడడం అత్యంత విచారకరం. మేరు పర్వతం వంటి వ్యక్తిత్వం కల్గిన మహానేత ఏసి; తర్వాత వచ్చిన వారంతా ఆ చెట్టు పేరు చెప్పి కాయలమ్ముకునే వారే తప్ప, తమ ప్రతిభతో ఆయనకు గుర్తింపు తెచ్చిన వారెవ్వరూ లేరు. ఒక పార్కుకు పేరు పెట్టినంత మాత్రాన ఆయన ప్రతిష్ట పెరగదు; పెట్టకపోతే కళంకం రాదు. ఆ తరం మనుషుల గుండెల్లో కొలువు దీరిన నేత ఆయన. నెల్లూరు జిల్లాకు ఒక రూపం, ఒక గుర్తింపు, ఒక గౌరవం తెచ్చినవాడు. అటువంటి మహనీయుణ్ని ఇంత స్వల్ప విషయంలో వివాదంలోకి లాగడం తప్పు.

పార్కు నిర్మాణంలో ముగ్గురూ కలిసి పనిచేశారు. పేరు నిర్ణయంలోనూ ముందుగానే ముగ్గురు కలిసి కూర్చొని మాట్లాడుకొని వుంటే ఇంత సమస్య వచ్చేది కాదు కదా ? పార్కు నిర్మాణ సారథిగా శ్రమపడిన వాడు కాబట్టి, జన్మభూమి పథకం నియమం ప్రకారం 30 శాతం నిధి కంట్రిబ్యూట్ చేసిన దాతగా తాను తన పేరు పెట్టుకుంటానని జెవిఎస్ రెడ్డి నిర్మొగమాటంగా మొదటే మాట్లాడి వుండినా; ఇదొక ప్రత్యేక తరహా ప్రాజెక్టు కాబట్టి దానికి సముచిత నామకరణం జరగాలని కలెక్టర్ గారు ఒక సమావేశం ఏర్పర్చి, పదిమంది సలహాలు అడిగి వుండినా; ఏసి శత జయంతి వత్సరం కాబట్టి 23 ఏళ్లకు పైగా మునిసిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన ఆ నేతకు మునిసిపల్ సంస్థను అంకితం చేయడం సమంజసమని వివేకానంద రెడ్డి ప్రతిపాదించి వుండినా సాఫీగా నిర్ణయం జరిగి వుండేది - ఎవరికి వారు దాపరికంతో వ్యవహరించి, చివరి కొచ్చేసరికి కోరికలు దాచుకోలేక పోవడం తప్పు. ఇటువంటి వివాదాలలో ఎప్పుడూ రాజకీయ వాదులదే పై చేయి కావడం సహజం. ఏసి మీద వ్యాఖ్యలు వివేకానంద రెడ్డికి పెద్ద ఆయుధం. మునిసిపల్ కౌన్సిల్‌లో మెజారిటీ ఆయనదే. ఆ ధైర్యంతోనే మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం పిల్చి, మరొకసారి అదే తీర్మానం చేయించే ప్రతిపాదన చేశారు. నిమిషం వంటి పార్టీలా ఏసిని కించ పరచడం తప్పు అనే అభిప్రాయంతో వివేకాను సమర్థించాయి.

ఇటువంటి విషయాలలో పంతాలు, పట్టింపుల కంటే - చర్చలు, సంప్రదింపులు పని సానుకూలం చేస్తాయి. ఆ సూక్ష్మం తెలుసుకోకుండా ప్రవర్తిస్తే రచ్చలు తప్పవు. ఇంతటితోనైనా దీనికి ఫుల్‌స్టాప్ పెట్టండి. ఎవరి పేరు పెట్టినా - అసలు పార్కు నిర్మించాలనే తలంపు చేసిన కలెక్టర్ గారి సదుద్దేశాన్ని; తన వ్యాపార సాహారాలు వదిలేసి ఏడాది కాలం వెట్టి చాకిరీ చేసిన జెవిఎస్ రెడ్డి శ్రమను సముచిత రీతిలో గుర్తించడం, సరైన ప్రాయశ్చిత్తం ఏర్పర్చడం న్యాయం! ఆ గుర్తింపు కొరకైనా వారు మొగమాటపడితే వివేకానంద రెడ్డి అందుకు ప్రతిపాదన చేయడం బాగుంటుంది. *

---


# ఉత్తరక్రియలు

నా భార్య

# పెళ్ళకూరు జనార్దనమ్మ



పెళ్ళకూరు జనార్దనమ్మ

31.12.1999 తేది శుక్రవారం స్వర్గస్తురాలైనది.
ఆమెకు శ్రద్ధాంజలి ఘటిస్తూ,

**కర్మక్రతువులు**

| | | |
|---|---|---|
| 12.1.2000 తేది | బుధవారం | నిలువు |
| 13.1.2000 తేది | గురువారం | పెద్దకర్మ |

నెల్లూరు, దర్గామిట్ట, రాజరాజేశ్వరి దేవాలయం వెనుక 9వ వీధిలో, మా ఇంట్లో జరుగును. బంధు మిత్రులు తెలియగోరుతాము.

**భర్త: పెళ్లకూరు వెంకటనారాయణరెడ్డి**

తల్లి: **రంగమ్మ** చెల్లెలు : **జయలక్ష్మమ్మ**

కుమారులు : **మహేష్‌రెడ్డి, మహీధర్ రెడ్డి**

కోడళ్ళు : **పద్మ, భవాని**

కుమార్తెలు : **ప్రసూన, లక్ష్మి**

అల్లుళ్ళు : **వాసిరెడ్డి ప్రభాకరరెడ్డి, కనుపూరు మోహన్ రెడ్డి**

మనుమళ్ళు : **నవీన్, సురేష్, పవన్, ప్రదీప్, సంతోష్**

మనుమరాళ్ళు : **లీనా, దీప్తి, వినూష**

